
# సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 26 । ఆగస్టు । 2023



**సోమశిలలో 18.735 టీఎంసీలు**

చేజర్ల(సోమశిల): జలాశయంలో శుక్రవారం 18.735 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 250, దక్షిణ కాలువకు 254 క్యూసెక్కులు వదులుతున్నారు.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.60,550 |
| 2 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.5,438 |
| 3శాతం జీఎస్టీతో | రూ.5,601 |
| నవర (8గ్రా) | రూ.44,808 |

గరిష్టం/కనిష్టం
38.8 /27.5

**వాతావరణం**

వాతావరణంలో తేమ 61 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా శనివారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

## న్యూస్‌రీల్

### వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

**నెల్లూరు(క్రైమ్):** మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తినైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం పోలీసు కవాతు మైదానంలో సివిల్, ఏఆర్, హోంగార్డ్స్ విభాగాల పోలీసు అధికారులు, సిబ్బంది నిర్వహించిన కవాతును ఎస్పీ పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీసు సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనారోగ్యం, బదిలీలు, ఈఎల్‌పీఎఫ్, డిజర్సన్, కోఆపరేటివ్, భద్రత లోన్, తదితర సమస్యలను సిబ్బంది అర్జీల రూపంలో ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిశీలించిన ఆయన రోజుల వ్యవధిలోనే సమస్యలను పరిష్కరించాలని జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. వృత్తిపరంగా, ఆరోగ్యపరంగా వారెదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు డీ హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### స్టాన్‌హౌస్‌పేట ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు

**నెల్లూరు సిటీ:** నగరంలోని స్టాన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా ఉస్నం శ్రీనివాసులుకు బాధ్యతలు కేటాయిస్తూ జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటగిరి సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను డిప్యుటేషన్‌పై నెల్లూరు స్టాన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు.

# లాభాల బాటలో డీసీసీబీలు

- రూ.295 కోట్ల సాయంతో నష్టాల నుంచి గట్టెక్కించిన సీఎం జగన్
- రాష్ట్ర వ్యవసాయ, సహకార మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి




డీసీసీబీ సీఈఓల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత రాష్ట్రంలోని అన్ని రంగాలు పురోగతి సాధిస్తున్నాయని, ఎన్నో దశాబ్దాలుగా నష్టాల్లో ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను లాభాల బాట పట్టించిన ఘనత ఆయనకే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయ,సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లో రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న 13 జిల్లాల డీసీసీబీల సీఈఓల సదస్సును శుక్రవారం మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కువ నష్టాల్లో కూరుకుపోయిన కర్నూలు, కడపతో పాటు ఇతర డీసీసీబీల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ రూ.295 కోట్ల సాయం అందజేశారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని డీసీసీబీలు లాభాల్లో ఉన్నాయని వివరించారు. నెల్లూరు డీసీసీబీ నష్టాల నుంచి గట్టెక్కి లాభాలతో నాబార్డ్, ఆప్కాబ్ నుంచి నాలుగు అవార్డులు అందుకోవడం అభినందనీయమన్నారు. సీఎం వైఎస్ జగన్ సహకార రంగాలపై నిత్యం సమీక్షిస్తూ, వాటి అభివృద్ధికి చేస్తున్న ఆలోచనా విధానాలతోనే డీసీసీబీలు లాభాలు ఆర్జిస్తున్నాయని తెలిపారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా ఆప్కాబ్, డీసీసీబీల్లో బ్యాంకింగ్, ఆడిటింగ్ రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులను సభ్యులుగా చేర్చేందుకు సహకార చట్టాల్లో మార్పులు చేశామని చెప్పారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీ అందిస్తున్న సేవలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. రాజకీయ నాయకుల పదవులు శాశ్వతం కాదని, సీఈఓలు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి డీసీసీబీల అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ సీఎం చొరవతో నేడు రాష్ట్రంలోని అన్ని డీసీసీబీలు లాభాల్లో పయనిస్తున్నాయని తెలిపారు. దేశంలోని బ్యాంకింగ్ రంగాల్లో సహకార బ్యాంకింగ్ రంగం మంచి విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలుస్తుందన్న నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. నెల్లూరు డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన రూ.74 కోట్ల గ్రాంట్ ఫలితంగానే నేడు నెల్లూరు డీసీసీబీ లాభాల్లో నడుస్తోందన్నారు. గత రెండేళ్లుగా బ్యాంకు అభివృద్ధికి అధికారులు, సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వాణిజ్య బ్యాంకులకు దీటుగా 24 గంటల్లో రుణాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. బ్యాంకు సేవలను జిల్లాలోని రైతులు, ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మంత్రి కాకాణి,ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఝాన్సీరాణిని డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సీఈఓ శంకర్‌బాబు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి, నాబర్డ్ జీఎం జయకన్నన్, డీడీఎం రవి సింగ్, 13 జిల్లాల డీసీసీబీ సీఈఓలు, డీజీఎంలు, ఏజీఎంలు, నెల్లూరు జీఎం సరిత పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి

**నెల్లూరు(దర్గామిట్ట):** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్లో శుక్రవారం నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఈ–క్రాప్, ఈ–కేవైసీ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారులు పూర్తిస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి నష్టపోకుండా చూడాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా జిల్లాలో



మాట్లాడుతున్న దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి

డ్రోన్‌ల వినియోగానికి ఇప్పటికే 18 మందికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. మరింత మందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఎం హరినారాయణన్ మాట్లాడుతూ వ్యవసాయ సలహామండళ్ల సూచనలు, సలహాలను ప్రభుత్వానికి నివేదించి అమలు చేస్తామన్నారు. జేసీ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హార్టికల్చర్ వర్సిటీ బోర్డు సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, జేడీఏ సుధాకర్‌రాజు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, పశుసంవర్థక శాఖ జేడీ కోటేశ్వరరావు, మార్క్‌ఫెడ్ డీఎం పవన్, ఎల్డీఎం టీ శ్రీకాంత్ ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, మార్కెటింగ్ శాఖ ఏడీ అనిత, తదితరులు పాల్గొన్నారు.

# ఆనం.. మౌనం!

టీడీపీ కండువా కప్పుకోకుండానే యువగళం యాత్రలో హడావుడి చేసిన మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రస్తుతం మౌనం దాల్చడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజకీయ పునర్జన్మనిచ్చిన వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచిన ఆనంకు టీడీపీ రాచబాట వేసినా కాలం కలిసి రావడం లేదు.

- ఆత్మకూరులో పోటీపై అనాసక్తి
- సొంత సర్వేల్లోనూ ఎదురీత
- టీడీపీ కార్యక్రమాలకు దూరం
- మహాశక్తి నిర్వహణకు నిరాకరణ



**సాక్షి ప్రతినిధి, నెల్లూరు:** జిల్లా రాజకీయ ముఖచిత్రంలో ఒకప్పుడు ఆనం రామనారాయణరెడ్డి ఓ వెలుగు వెలిగినా మారిన రాజకీయ పరిస్థితులతో ఆయనకు ప్రాధాన్యం తగ్గుతూ వస్తోంది. ఆనం కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి వెళ్లారు. అప్పటికే అధికారంలో ఉన్న టీడీపీ ఆనంను టికెటీజీగా తీసుకుంది. పార్టీలో చేరే ముందు ఇచ్చిన ఒక్కహామీని నెరవేర్చలేదు. సీనియర్ నేతకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోగా ఆత్మకూరులో పార్టీ ఇన్‌చార్జిగా కూడా నియమించలేదు. దీంతో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఆనంను అక్కున చేర్చుకుని వెంకటగిరి ఎమ్మెల్యేగా హోదా ఇచ్చింది. అక్కున చేర్చుకున్న పార్టీకే వెన్నుపోటు పొడిచి ఆనం మళ్లీ టీడీపీలోకి వెళ్లడంతో ఆయనకున్న ఇమేజ్ సొంత క్యాడర్‌లోనే దెబ్బతింది.

**అయోమయంలో ఆనం**

ఆత్మకూరుపై మోజు పెట్టుకున్న ఆనంకు అన్నింటా అపశకునాలే ఎదురవుతున్నాయి. లోకేశ్ పాదయాత్ర సందర్భంగా ఆత్మకూరులోకి ఆయ న రీఎంట్రీ ఇచ్చినా యాత్రను విజయవంతం చేయడంలో విఫలమయ్యారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన సీనియర్ నేత గూటూరు కన్నబాబును పాదయాత్రలోకి ఎంట్రీ ఇవ్వకుండా చేయించారు. అదే రీతిలో మరో సీనియర్‌నేత, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడును ఘోరంగా అవమానించారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు నేతలు ప్రస్తుతం ఆనం ప్రవేశాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీలో ఉన్నప్పటికీ ఆనం కోసం పనిచేసేది లేదని తెగేసి చెబుతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పార్టీలో కి వచ్చి క్యాడర్‌ను ముప్పుతిప్పలు పెట్టి వెళ్లిపోయిన వ్యక్తికి మరోసారి ప్రవేశానికి ఎలా గ్రీన్‌సిగ్నల్ ఇస్తారంటూ కన్నబాబు తన అనుచరుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేశారనే ప్రచారం ఉంది.

**సొంత సర్వేల్లోనూ నిరాశే**

ఆనం టీడీపీ పక్షం వహించాక రెండు టీములతో సొంత సర్వే చేయిస్తున్నారని సమాచారం. తనతో పాటు తన కుమార్తె కైవల్యారెడ్డి ఏదోక అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తే గెలుపు ఎలా ఉంటుందన్న అంశంపై సర్వే చేయిస్తుండగా, అధికారం కోసం పార్టీలు మారుతున్నారని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఆయన కుమార్తె కైవల్యారెడ్డి అభ్యర్థిత్వంపై నిర్వహించిన సర్వేలోనూ ఎలాంటి సానుకూల పరిస్థితులు కనిపించలేదని తెలుస్తోంది. దీంతో ఆనం చూపు వెంకటగిరి వైపు ఉన్నట్లు కూడా రాజకీయవర్గాల్లో ప్రచారం సాగుతోంది. మరో వైపు కుటుంబం కూడా ఆనంతో కలిసిరావడం లేదు. దీంతో పాటు ఆనంను ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఆత్మకూరులో పార్టీని నడిపించేందుకు, ఎన్నికల ఖర్చును పార్టీయే పెట్టుకుంటుందని చెప్పిన వారే ప్రస్తుతం ముఖం చాటేస్తుండడంతో ఆయన అయోమయంలో పడ్డారు.

**టీడీపీ కార్యక్రమాలపై నిరాసక్తి**

టీడీపీ నిర్ణయం మేరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో మహిళలతో మహాశక్తి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నా ఆత్మకూరు నియోజకవర్గంలో మాత్రం చేపట్టడం లేదు. ఇటీవల మహాశక్తి కార్యక్రమ నిర్వహణపై నిర్వాహకులు ఆనంను కలిసినా తాను ఇప్పట్లో సహకరించలేనని నిరాకరించారనే ప్రచారం ఉంది.

# పురాతన నాణేల కేసులో పురోగతి

- ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు
- 21 సవర్ల బంగారు నగలు, రూ.4 లక్షల స్వాధీనం
- రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి వెల్లడి


మాట్లాడుతున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

పొదలకూరు: పురాతన బంగారు నాణేలను కరిగించి విక్రయించిన ఘటనపై ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి తెలిపారు. పొదలకూరుకు సమీపంలో చిట్టేపల్లి ఎస్సీకాలనీ దగ్గర అంకమ్మతిప్పపై మే 7వ తేదీన లభ్యమైన పురాతన బంగారు నాణేల విక్రయానికి సంబంధించిన కేసు వివరాలను డీఎస్పీ శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో వెల్లడించారు. తిప్పపైకి కుందేళ్ల పడుతున్న గిరిజనులతోపాటు వరుణ్ అతడి స్నేహితులు అజిత్, వెంకటేశ్వర్లు వెళ్లారు. ముగ్గురు రాజులకాలం నాటి బంగారు వర్ణంలో ఉన్న చెంబును గుర్తించారు. వారు వెళ్లి కాలనీలోని అమరన్‌కు చెప్పారు. అతను అందులో ఉన్న నాణేలను తీసుకున్నాడు. ఈ విషయాన్ని వరుణ్ బీటెక్ చదువుతున్న తన సోదరి భానుశ్రీకి చెప్పాడు. ఆమె పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఇది సోషల్ మీడియాలో వైరలైంది. పోలీసులు జోక్యం చేసుకుని విచారణ నిర్వహించారు. నిజాలు నిగ్గుతేల్చి వెంకటేశ్వర్లు, అమరన్, అజిత్‌పై కేసు నమోదు చేశారు. వారి నుంచి 21 సవర్ల బంగారు నగలు, రూ.4 లక్షల నగదు, కారు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. చెంబులో మొత్తం 770 గ్రాముల వరకు బంగారు నాణేలు, బంగారం ఉండగా 490 గ్రాముల నాణేలను నిందితులు కరిగించి బంగారు నగలు చేయించుకోవడంతోపాటు, నగదుగా మార్చుకుని గ్రామంలో అప్పులు, పొదుపు గ్రూపు కింద ఉన్న రుణాలను చెల్లించారు. చెరువులో పడేసిన చెంబును పోలీసుల ఆధ్వర్యంలో గాలిస్తున్నారు. నిధి నిక్షేపాలు, పురాతన నాణేలు, బంగారు ఆభరణాలు లభ్యమైతే వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని డీఎస్పీ వెల్లడించారు. సమావేశంలో సీఐ జి.సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్కే కరిముల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

## భర్త వేధింపులపై ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్

- స్పందించిన పోలీసులు

నెల్లూరు(క్రైమ్): వారిద్దరు ఉన్నతోద్యోగులు. అయితే విభేదాలు చోటుచేసుకున్నాయి. దీంతో భర్త తనను వేధిస్తున్నాడంటూ భార్య ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టడంతో పోలీసులు స్పందించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. జీవీఆర్ఆర్ కళాశాల సమీపంలో దంపతులు తమ కుమార్తెతో కలిసి నివాసం ఉంటున్నారు. భర్త పశుసంవర్థక శాఖలో, భార్య వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు చేస్తున్నారు. వారి మధ్య కొంతకాలంగా విభేదాలున్నాయి. తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో భర్త వేధిస్తున్నాడంటూ భార్య శుక్రవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారు. దీనిపై స్పందించిన వేదాయపాళెం పోలీసులు దంపతుల ఇంటికి చేరుకుని మాట్లాడారు. తర్వాత పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

# మనస్పర్థలతో దంపతుల ఆత్మహత్య

- అనాథగా మిగిలిన నాలుగేళ్ల కుమార్తె


సుప్రియ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): మనస్పర్థలతో దంపతులు ఆత్మహత్య చేసుకోగా.. నాలుగేళ్ల కుమార్తె అనాథగా మిగిలిన విషాద ఘటన ఇది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని కొండాయపాళెం అనగుంటలో ప్రసన్నాంజనేయులు (30), సుప్రియ (24) దంపతులు ఉంటున్నారు. వారు ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. కుమార్తె మహిత ఉంది. ప్రసన్నాంజనేయులు బేల్దారి పనులు చేసేవాడు. భర్త వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని భార్యకు తెలిసి వారి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. తరచూ ఇద్దరూ గొడవపడేవారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి సుప్రియ హెయిల్ ఆయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి ప్రమాదకరంగా ఉందని, అబ్జర్వేషన్‌లో ఉంచాలని వైద్యులు తెలిపారు. కానీ ప్రసన్నాంజనేయులు వారి మాటలను పెడచెవిన పెట్టి భార్యను ఇంటికి తీసుకొచ్చేశాడు. కొన్ని గంటలు గడిచిన తర్వాత ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో తిరిగి హాస్పిటల్లో చేర్పించగా శుక్రవారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. సుప్రియ మృతికి ఆమె భర్త, అత్తలే కారణమని పూర్తిస్థాయిలో విచారించి తగిన చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లిదండ్రులు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం మార్చురీకి తరలించారు.

**రైలు కిందపడి..**

ఎక్కడ తాను ఇబ్బంది పడతాననో? లేక భార్య మృతిని జీర్ణించుకోలేకనో స్పష్టమైన కారణం తెలియదు కానీ ప్రసన్నాంజనేయులు శుక్రవారం తెల్లవారుజామున పెన్నా బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై డి.హరిచందన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కారణాలు ఏవైనా తల్లిదండ్రులు ఇద్దరూ బలవన్మరణం చెందడంతో చిన్నారి అనాథ అయింది.

**నిమ్మ ధరలు (కిలో)**

| | |
|---|---|
| పెద్దవి | : రూ.55 |
| సన్నవి | : రూ.40 |
| పండ్లు | : రూ.10 |



**పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు**

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 133 |
| లేయర్ (లైవ్) | : 105 |
| బ్రాయిలర్ చికెన్ | : 230 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 256 |
| లేయర్ చికెన్ | : 178 |









# సెల్‌ఫోన్ దొంగతనానికి వెళ్లి హత్య

- వాచ్‌మన్ హత్య కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాజీ

నెల్లూరు(క్రైమ్): వాచ్‌మన్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. శుక్రవారం నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎం.బాజీ వివరాలను వెల్లడించారు. ఎం.సుబ్రహ్మణ్యం (43)ది రంగనాయకులపేట. రైల్వేస్టేషన్ తూర్పు ప్రధాన ద్వారం సమీపంలో జరుగుతున్న భవన నిర్మాణాల వద్ద వాచ్‌మన్‌గా ఉండేవాడు. గతనెల 24వ తేదీ రాత్రి ఆయన విధుల్లో ఉండగా దారుణ హత్యకు గురయ్యాడు. మృతుడి కుమారుడు దివాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. బాజీ ఆధ్వర్యంలో ఎస్సైలు తమ సిబ్బందితో కలిసి సాంకేతికత ఆధారంగా నిందితుడు పప్పులవీధి సత్రం స్కూల్ సమీపంలో నివాసం ఉంటున్న రాధాకృష్ణ అలియాస్ తక్కారిగా గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 24వ తేదీ పాత చెక్‌పోస్ట్ సమీప రైల్వేగేట్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు.

**నిద్ర పోతుండగా..**

రాధాకృష్ణ రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సెల్‌ఫోన్లను చోరీ చేసి వాటిని అమ్మగా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసేవాడు. గతనెల 24వ తేదీ రాత్రి నిందితుడు సెల్‌ఫోన్లను అపహరించేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. స్టేషన్ ప్రాంగణంలో తిరుగుతుండగా వాచ్‌మన్ తన ఫోన్‌లో పాటలు వింటూ కునుకు తీయడాన్ని గుర్తించాడు. ఆ ఫోన్‌ను దొంగలించే క్రమంలో నిద్ర నుంచి మేల్కొన్న వాచ్‌మెన్ ప్రతిఘటించాడు. ఇద్దరి మధ్య పెనుగులాట జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన రాధాకృష్ణ పక్కనే ఉన్న రాయితో సుబ్రహ్మణ్యంపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. హత్య కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు శివప్రకాష్, రెహ్మాన్, సిబ్బంది జి.వెంకటేశ్వర్లు, ఎస్.సురేంద్రబాబు, రత్నం, మోహన్, వేణును డీఎస్పీ అభినందించారు.

# పెళ్లికి వెళ్లొస్తుండగా రోడ్డు ప్రమాదం

- ఎనిమిది మందికి గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి కాకాణి


బాధితురాలిని పరామర్శిస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మనుబోలు మండల పరిధిలోని వడ్లపూడి నుంచి చెరుకుమూడి వెళ్లే మార్గంలో శుక్రవారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. మనుబోలు మండలం చెరుకుమూడి దళితవాడకు చెందిన బొడ్డు ఢిల్లీబాబు కుమార్తెకు పొదలకూరు మండలం తోడేరు పంచాయతీ రత్నగిరి గ్రామానికి చెందిన అబ్బాయితో శుక్రవారం ఉదయం వివాహం జరిగింది. దీనికి ట్రాక్టర్‌లో వెళ్లిన వధువు తరఫు బంధువులు తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ట్రాక్టర్ ట్రక్‌లో కూర్చొన్న బొడ్డు మోహన్, అతని భార్య మమత, వారి బంధువులు లక్ష్మీదేవి, నందిని, ఏడుకొండలు, మాధవి, బొడ్డు మధు, బొడ్డు సంధ్య తదితరులు గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మెరుగైన వైద్య సేవలందించాలి : కాకాణి**

నెల్లూరు(బారకాసు): ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడిన బాధితులందరికీ మెరుగైన వైద్య సేవలందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే మంత్రి నెల్లూరులోని జీజీహెచ్‌కు చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలందించి, క్షేమంగా వారి గ్రామానికి చేర్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. చిన్నపాటి శస్త్రచికిత్సలు అవసరమైన వారికి చేసేందుకు వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. మంత్రి వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, ఆర్డీఓ మలోల, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ కో–ఆర్డినేటర్ లక్ష్మీసునంద ఉన్నారు.


చికిత్స పొందుతున్న మహిళ

# మహిళ వైద్యానికి దాతల సాయం

సాక్షి ఎఫెక్ట్..

దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరుకు చెందిన షేక్ షాహినా గుండెజబ్బుతో బాధపడుతుండగా ఆమె వైద్యానికి దాతలు సాయం చేశారు. ఈనెల 23వ తేదీన సాక్షిలో 'పేద కుటుంబానికి పెద్ద కష్టం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో పలువురు స్పందించారు. హైదరాబాద్‌కు చెందిన మాదాల అర్చన రూ.20 వేలు, నర్రవాడకు చెందిన పులివర్తి కొండపనాయుడు రూ.5 వేలు, కామేపల్లికి చెందిన అమీర్‌బాషా రూ.5 వేలు, నర్రవాడకు చెందిన షేక్ బాబు రూ.5 వేలు, వింజమూరుకు చెందిన రంతుల్లా రూ.2 వేలు, ఒంగోలుకు చెందిన నబీ సాహెబ్ రూ.2 వేలు చొప్పున బాధిత మహిళకు ఫోన్ పే ద్వారా సహాయం అందించారు.

# ఆటోలో నుంచి పడి బాలుడి మృతి


మృతిచెందిన నందివర్ధన్

సీతారామపురం: మండలంలోని దేవమ్మ చెరువు వద్ద ఓ బాలుడు ఆటోలో నుంచి రోడ్డుపై పడి మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఉదయగిరి మండలం లింగమనేనిపల్లికి చెందిన ఓ కుటుంబం వరలక్ష్మీవ్రతం సందర్భంగా ఆటోలో సిద్ధేశ్వరానికి పూజల నిమిత్తం వచ్చారు. పూజల అనంతరం తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా దేవమ్మ చెరువు వద్ద ప్రమాదవశాత్తు బాలుడు కె.నందివర్ధన్ (6) ఆటోలో నుంచి రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. బాలుడు పడిపోతుండగా తల్లి ధనలక్ష్మి, నానమ్మ కొండమ్మ పట్టుకోవడానికి ప్రయత్నించారు. వారు కూడా ఆటోలో నుంచి పడిపోయారు. దీంతో ధనలక్ష్మికి కాలు విరగ్గా, కొండమ్మ చేతులు, ముఖంపై గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. ఉదయగిరి వైద్యశాలలో మృతదేహాన్ని సీఐ గిరిబాబు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

# వృద్ధురాలి బలవన్మరణం


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సంగం: అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధురాలు సంగం ఇసుకరీచ్‌కు వెళ్లే దారిలో ఉన్న బీరాపేరు వాగులో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం జరిగింది. ఎస్సై నాగార్జునరెడ్డి కథనం మేరకు.. సంగం మండలం తరుణవాయికి చెందిన పి.అంకమ్మ (65)కు నలుగురు సంతానం. భర్త మరణించారు. వేర్వేరు గ్రామాల్లో ఉంటున్న సంతానం వద్ద నెలరోజుల వంతున ఉండేది. కాగా అంకమ్మ కొంతకాలంగా మోకాళ్ల నొప్పులు, అనారోగ్య సమస్యలతో బాధ పడుతోంది. వాటిని తట్టుకోలేక శుక్రవారం వైద్యశాలకు వెళ్తొస్తానని బీరాపేరు వాగులో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి మృతదేహాన్ని బయటకు తీయించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృత్యువాత



వెంకటాచలం : గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందిన ఘటన మండల కేంద్రమైన వెంకటాచలంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసున్న గుర్తుతెలియని వ్యక్తి నాలుగురోజుల నుంచి వెంకటాచలం కసుమూరు రోడ్డు ప్రాంతంలో తిరుగుతున్నాడు. అతను శుక్రవారం మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.